## నూతన వధూవరులను ఆశీర్వదించిన గంట సంజీవరెడ్డి



**కేసముద్రం/ ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త);** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామం 5వ వార్డుకు చెందిన సింగిరెడ్డి సురేందర్‌రెడ్డినాగమ్మ దంపతుల కుమారుడు సతీష్‌రెడ్డి, శ్రావణిల వివాహం బుధవారం స్థానిక రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. వివాహ వేడుకకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ధన్సరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. నూతన వధూవరులను పుష్పగుచ్ఛాలతో అభినందించి, అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు రావుల మురళి, అమీనాపురం కాంగ్రెస్ అధ్యక్షుడు సమ సుధాకర్‌రెడ్డి, పైరల ప్రభాకర్, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# మదర్ థెరిస్సా జయంతి వేడుకలు



**మధిర/ ఆగస్టు 27 (జర్నలిస్ట్ వార్త):** మధిర పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి వెనుక ఉన్న మదర్ థెరిస్సా సేవాసదనంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సామాజిక సేవకుడు, విశ్రాంత ఎంపీడీవో మాధవరపు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సేవాసదనంలోని మానసిక దివ్యాంగ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రార్థించే పెదవుల కన్నా. సాయం చేసే చేతులు మిన్న అనే స్ఫూర్తితో మానసిక దివ్యాంగుల కోసం సేవాసదనం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సేవాసదనం నిర్వాహకురాలు నల్లపు స్వర్ణలత, అమర్లపూడి సుందరరావు, నల్లపు విజయమ్మ, సేవాసదనం పిల్లలు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి యువకుడిపై దాడి



**వైరా/ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త):** వ్యక్తిగత కారణాలతో ఓ యువకుడిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన వైరా మండలం తాటిపూడి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిడియాల గోపి ఇంటిపైకి అర్ధరాత్రి వెళ్లిన కొందరు వ్యక్తులు అతడిపై దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనలో గోపికి తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

సమాచారం అందుకున్న ఎస్సై రామారావు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలితమ కుమారుడిపై దాడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని గోపి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## గౌడ యువజన అధ్యక్షుడిగా సాగర్‌గౌడ్



**మహబూబాబాద్/ ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం మహబూబాబాద్ జిల్లా యువజన అధ్యక్షుడిగా కారింగుల సాగర్‌గౌడ్ నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని సంఘం కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు రామచంద్రరావు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. గౌడ యువత అభ్యున్నతి, సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

జిల్లాలో గౌడ యువత కోసం హాస్టల్ నిర్మాణానికి కృషి చేయడంతో పాటు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటానన్నారు. యువత సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు రామచంద్రరావు, రాష్ట్ర అధ్యక్షుడు గుండాల మల్లేష్‌గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోల్కాపురి శ్రీకాంత్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్‌గౌడ్‌లకు సాగర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం నాయకులు జెర్రీ పోతుల వెంకన్నగౌడ్, గండి శారదగౌడ్, బోలగాని నవీన్‌గౌడ్, ముంజాల రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాడెపై తమ్ముడికి రాఖీ.. కన్నీటితో వీడ్కోలు

### రాఖీ పండుగకు రెండు రోజుల ముందే విషాదం

### పది రోజుల వ్యవధిలో తండ్రీకొడుకుల మృతి.. కురవిలో హృదయవిదారక ఘటన

**మహబూబాబాద్/ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త):**
రాఖీ పండుగ వచ్చిందంటే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఆ పండుగను ఆనందంగా జరుపుకోవాల్సిన ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. తమ్ముడికి రాఖీ కట్టి, మిఠాయి తినిపించాలని ఆశపడిన అక్కచివరకు పాడెపై ఉన్న తమ్ముడి మృతదేహానికి రాఖీ కట్టి కన్నీటి వీడ్కోలు పలికిన హృదయవిదారక ఘటన కురవి మండల కేంద్రంలో చోటుచేసుకుంది.

కురవికి చెందిన మోటపోతుల రమేష్ (36) అనారోగ్యంతో మృతిచెందాడు. రాఖీ పండుగకు రెండు రోజుల ముందు తమ్ముడు మృతిచెందడంతో అక్క గుండెలవిసేలా రోదించింది. అంతిమయాత్రలో దింపుడుకళ్లం వద్ద పాడెపై ఉన్న తమ్ముడి మృతదేహానికి రాఖీ కట్టింది. అనంతరం మిఠాయి



నోటిలో పెట్టి. తాను కూడా మిఠాయి తింటూ కన్నీళ్లతో విలపించింది.

రాఖీ పండుగకు వచ్చి నీకు రాఖీ కడదామనుకున్నా.. ఇంతలోనే మమ్మల్ని విడిచి వెళ్లావా తమ్ముడా..' అంటూ ఆమె రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. తమ్ముడి చేతికి రాఖీ కట్టాల్సిన అక్క.. పాడెపై ఉన్న మృతదేహానికి రాఖీ కట్టడం చూసిన వారంతా తీవ్ర విషాదానికి లోనయ్యారు.

**పది రోజుల్లోనే తండ్రీకొడుకుల మృతి**

ఈ కుటుంబాన్ని వరుస విషాదాలు వెంటాడుతున్నాయి. రమేష్ తండ్రి పది రోజుల క్రితమే మృతిచెందారు. ఆయన దశదినకర్మ బుధవారం నిర్వహించాల్సి ఉండగా.. ఇంతలోనే రమేష్ కూడా మృతిచెందాడు. గతంలో రమేష్ తమ్ముడు కూడా అనారోగ్యంతో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. తక్కువ వ్యవధిలోనే కుటుంబంలోని ఇద్దరు పురుషులు మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ విషాద దృశ్యాలు స్థానికులను తీవ్రంగా కలచివేశాయి.

# ఎమ్మెల్యే రాగమయి దయానంద్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**తల్లాడ/ ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త)**సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సహకారంతో రంగం బంజర గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజల రుణం తీర్చుకుంటానని ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ దేవరపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. పల్లెలు అభివృద్ధి చెందితేనే భవిష్యత్ తరాలకు మెరుగైన జీవనం అందుతుందనే లక్ష్యంతో ఆమె ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆమె సహకారంతో రంగం బంజరను ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని, తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. దోమల



నివారణ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు, అధికారులు సహకరించాలని సర్పంచ్ కోరారు. అందరి సహకారంతో రంగం బంజరను ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ



పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నిషేధిత జాబితా పేరుతో భూ యజమానులపై వేధింపులా?

**ఖమ్మం/ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త):** నిషేధిత భూముల జాబితా పేరుతో భూ యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని టీడీపీ జిల్లా నేత కొండబాల కర్ణాకర్ ఆరోపించారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడం సరికాదన్నారు. ఖమ్మంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 22ఏ నిబంధన అమల్లోకి రాకముందు రాష్ట్రంలో భూముల రికార్డులు లేవా? అని ప్రశ్నించారు. గతంలో ఉన్న భూ రికార్డుల ఆధారంగా వ్యవహరించాల్సింది పోయి, కొత్తగా పెద్దఎత్తున భూములను నిషేధిత జాబితాలో




చేర్చడంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో భూములను చేర్చి, వాటిని తొలగించేందుకు భూ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరపాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు ఆరోపణలు, ప్రత్యారోపణలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. భూ యజమానుల సమస్యలను పట్టించుకోకపోతే ప్రజాక్షేత్రంలో టీడీపీ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ వ్యవహారంపై బీజేపీ కూడా స్పందించకపోవడం గమనార్హమన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, మాజీ సొసైటీ చైర్మన్ గడిపూడి వెంకటేశ్వరరావు, కర్నాటి అశ్వినీకుమార్, నల్లమోతు సత్యనారాయణ, కామినేని శ్రీనివాసరావు, పరిటాల నాగార్జున, మల్లెంపాటి లహరిన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన నారపోగు ప్రసాద్.



**తల్లాడ /ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త);**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనయుడు, మంత్రి నారా లోకేష్ కు ఖమ్మం జిల్లా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సత్తుపల్లి ఎస్సి సెల్ నియోజకవర్గ నాయకులు నారపోగు ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నారా లోకేష్, బ్రాహ్మణి దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఆయన మంత్రికి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, రానున్న రోజుల్లో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి



**కారేపల్లి/ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త);** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రథమ చికిత్స అందిస్తున్న గ్రామీణ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) దాడులను తక్షణమే నిలిపివేయాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సింగరేణి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీజీఎంసీ దాడులతో గ్రామీణ వైద్యులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో గ్రామీణ వైద్యులకు పారామెడికల్ బోర్డు ద్వారా శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు. సుమారు 20 వేల మందికి వెయ్యి గంటల శిక్షణ అందించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 65 వేల మంది దరఖాస్తు చేసుకోగా 55 వేల మందిని అర్హులుగా గుర్తించారని వివరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతితో నిధుల కేటాయింపు లేక ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రక్రియను కొనసాగిస్తుందని ఆశించినా ఇప్పటివరకు గ్రామీణ వైద్యుల సమస్యలపై తగిన శ్రద్ధ చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఆర్‌ఎంపీలు గ్రామీణ ప్రాంతాల్లో కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. టీజీఎంసీ దాడులపై ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామీణ వైద్యుల సేవలకు చట్టబద్ధత కల్పించాలని కోరారు.

**పరిధికి మించి వైద్యం చేయొద్దు**

ఆర్‌ఎంపీలు తమ పరిధిలోనే ప్రాథమిక వైద్యం అందించాలని నాగేశ్వరరావు సూచించారు. పరిధికి మించి వైద్యం చేసి ఇబ్బందులు తెచ్చుకోవద్దని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారపు వెంకటాచారి, ఉపాధ్యక్షుడు నారపోగు సుదర్శన్, కౌన్సిల్ సభ్యులు దాసరి శ్రీనివాసరావు, దుస్సా మనోహర్, సింగరేణి మండల అధ్యక్షుడు మండెపూడి వీరయ్యచౌదరి, కార్యదర్శి ఆకారపు రఘు, ఐ.వెంకటేశ్వర్లు, సున్నం రామారావు, బ్రహ్మం, సైదులు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

## ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**మిర్యాలగూడ/ ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త):** అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మిర్యాలగూడ మండలం ఐలాపురం, దామరచర్ల మండలం రాళ్లవాగు తండాలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. లబ్ధిదారుల నూతన గృహాలను పరిశీలించి, కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడారు. వారికి గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండేలా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అధికారులతో సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామస్థులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాసు శేషమ్మకు సీఎం రేవంత్, ఎమ్మెల్యే నాగరాజు నివాళి



**హసన్‌పర్తి/ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త):** మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కాసు వెంగళరెడ్డి సతీమణి, మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి తల్లి, వైఎస్సార్‌సీపీ నేత కాసు మహేశ్‌రెడ్డి నాయనమ్మ కాసు శేషమ్మ దశదిన కర్మ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కార్యక్రమానికి హాజరయ్యారు. శేషమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల కోసం రేపు కలెక్టరేట్ ముట్టడి

## వేలాదిగా తరలిరావాలి: టీఎస్‌యూటీఎఫ్



**హసన్‌పర్తి/ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నా నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మేరుగు ప్రసన్న తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్ బిల్లులు, పదవీ విరమణ ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని అన్నారు. జీవో 317తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని, ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు కీలక పాత్ర పోషించారని ప్రసన్న పేర్కొన్నారు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. మహాధర్నాను విజయవంతం చేయాలని నాయకులు అజ్మీరా రాజారాం, బిక్షపతి, రజియా సుల్తానా తదితరులు కోరారు.

# మీలాద్‌ఉన్‌నబీ వేడుకల్లో ఎమ్మెల్యే బీఎల్ఆర్



**మిర్యాలగూడ/ ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త);** మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపురం 47వ వార్డులో ముస్లిం సోదరులు నిర్వహించిన మీలాద్‌ఉన్‌నబీ వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త మహమ్మద్ బోధనలు శాంతి, సోదరభావం, ప్రేమ, కరుణ, ఐక్యత వంటి గొప్ప విలువలను మానవాళికి అందించాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని మతాలు, వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి మెలిసి జీవించేలా కృషి చేయడం తన బాధ్యత అన్నారు. ప్రజల సంక్షేమం, శాంతి, సౌభ్రాతృత్వమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మతపెద్దలు, యువకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా జి.శారద ఏకగ్రీవం



**హసన్‌పర్తి/ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త):** హసన్‌పర్తి మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సెక్రటరీగా జెడ్‌పీహెచ్‌ఎస్ పెగడపల్లి వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.శారద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఈఓ ఏ.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శారదను ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వాసుదేవరావు, పీఈటీ ఏటీఎస్ అసోసియేషన్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ ఏ.శ్రీనివాస్‌రెడ్డితో పాటు మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు శారదను అభినందించారు. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి, క్రీడా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. శారద ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంఈఓ ఏ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



**హసన్‌పర్తి/ ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. మూలమలుపు విజయ గార్డెన్ సమీపంలోని డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను జీడబ్ల్యూఎంసీ అధికారుల సహకారంతో తొలగించారు. నీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గుర్తించి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు భాస్కూరి శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ అధికారులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేరుస్తాం



**కేసముద్రం/ఆగస్టు26 (జర్నలిస్ట్ వార్త):** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రం గ్రామానికి చెందిన ఉత్కూరి నవతా రాజు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వేముల భారతి శ్రీనివాస్‌రెడ్డి, కనుకుల సుభద్ర రాంబాబు, రాడం శ్రీనితో పాటు స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి




**ఎల్కతుర్తి/ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త):** తిమ్మాపురం గ్రామంలో నాలుగో వార్డు సభ్యుడు కొలుగూరి రమేష్‌పై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం తిమ్మాపురం గ్రామాన్ని సందర్శించిన ఆయన రమేష్‌ను కలిసి ఘటన వివరాలను తెలుసుకున్నారు.

అనంతరం అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ సర్పంచి ముప్పు మానస, ముప్పు మహేందర్, ముప్పు అభిరామ్ మూకుమ్మడిగా రమేష్‌పై దాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే దాడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం సిగ్గుచేటన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, సర్పంచి పాత్ర ఉన్నట్లు తేలితే వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

దళితులపై దాడులు, అవమానాలు, సామాజిక బహిష్కరణ వంటి ఘటనలను సహించేది లేదన్నారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని వర్తించే సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రొంటాల దేవా, మర్రి శ్రీనివాస్, శేనిగరపు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భీమదేవరపల్లి మండలంలో నూతన ఎమ్మార్పీఎస్ కమిటీలు




**భీమదేవరపల్లి/ఆగస్టు26 (జర్నలిస్ట్ వార్త):** సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరగనున్న మండల కమిటీల జాతీయ మహాసభను విజయవంతం చేయడానికి గ్రామాల్లో నూతన యువ ఎమ్మార్పీఎస్ కమిటీల ఏర్పాటు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు భీమదేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాంనగర్ గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షుడిగా కనకం రమేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా కనుక రాజు ఎన్నికయ్యారు. ముస్తాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కనుక వినయ్, ఉపాధ్యక్షుడిగా మిడిదొడ్డి సృజన్, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల కరుణాకర్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చంటయ్యపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లింగాల అఖిల్, ఉపాధ్యక్షుడిగా హర్షవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా లింగాల అజయ్ ఎన్నికయ్యారు. రత్నగిరి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పార్నందుల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా చిట్టెంపెల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా పార్నందుల ఆనంద్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ, భీమదేవరపల్లి ఎమ్మార్పీఎస్ కో-ఇంచార్జ్ వేల్పుల ప్రశాంత్, హాజరయ్యారు. కార్యక్రమంలో పార్నందుల సురేష్, తాళ్లపల్లి ఆశీర్వాదం, మాడుగుల ప్రభుదాస్, సిక సురేష్, నాగిళ్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

# మచ్చపురంలో ఎమ్మార్పీ-ఎస్‌ఎంఎస్‌పీ నూతన గ్రామ కమిటీలు

## సెప్టెంబర్ 9న జాతీయ మహాసభలకు సమాయత్తం




**గీసుకొండ/ఆగస్టు 26 (జర్నలిస్ట్ వార్త):** గీసుకొండ మండలం మచ్చపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నూతన గ్రామ కమిటీలను బుధవారం ఏర్పాటు చేశారు. జిల్లా సీనియర్ నాయకులు చిన్నపెల్లి రవి మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మాసాని గోపాల్ మాదిగ పాల్గొని మాట్లాడారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆలోచనా విధానాన్ని గ్రామస్థాయిలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని, ఇకపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల కోసం మరిన్ని ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అణగారిన వర్గాలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆరోపించారు. భవిష్యత్తులో బలమైన ఉద్యమాలను నిర్మించేందుకు తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ గ్రామ, మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ మహాసభలకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మచ్చపురం గ్రామ కమిటీఅధ్యక్షుడిగా మామునూరు శివకుమార్ మాదిగ, అధికార ప్రతినిధిగా దొమ్మటి వంశీ మాదిగ, ఉపాధ్యక్షుడిగా బరిగల హరీష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దుమ్మటి సందీప్ మాదిగ ఎంపికయ్యారు. సలహాదారులుగా నమిలో సారే మాదిగ, నమిండ్ల స్వామి మాదిగ, దొమ్మటి రాములు మాదిగలను నియమించారు. ఎంఎస్‌పీ గ్రామ కమిటీఅధ్యక్షుడిగా నమిండ్ల ప్రశాంత్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

